
నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 12 జూలై 2024 | MAHABUBNAGAR NARAYANPET



సర్వర్ పనిచేయకపోవడంతో బోసిపోయిన నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

# సర్వర్ డౌన్




# నిలిచిన రిజిస్ట్రేషన్లు

*సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లు బంద్.. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భూ బదలాయింపుల సేవలు నిలిచిపోయాయి. రూ.లక్షలాది ఆదాయం తీసుకొచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాంకేతిక లోపం తలెత్తింది. ఆఫీసుల్లో ఈకేవైసీ పనిచేయలేదు. దీంతో క్రయవిక్రయదారులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు తప్పలేదు. మంచి రోజు చూసుకొని.. స్లాట్ బుక్ చేసుకొని ఉత్సాహంగా కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్లు కావడం లేదన్న వార్తతో వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారులు శుక్రవారం రావాలని సూచించడంతో నిట్టూర్చుకుంటూ తిరిగి వెళ్లారు.* - నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, జూలై 11

- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద పడిగాపులు
- భూ బదలాయింపు ప్రక్రియలో సాంకేతిక సమస్య
- ఉమ్మడి జిల్లాలో పనిచేయని ఈ-కేవైసీ
- క్రయవిక్రయదారులకు తీవ్ర ఇబ్బందులు
- నేడు రావాలని సూచించిన అధికారులు
- నిరాశగా వెనుదిరిగిన స్లాట్ బుకింగ్‌వాసులు

నాగర్‌కర్నూల్, జూలై 11(నమస్తే తెలంగాణ) : సర్వర్ నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కార్యకలాపాలు స్తంభించాయి. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటైన వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లకు సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సేవలకు గురువారం అంతరాయం ఏర్పడింది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పథకం తీసుకొచ్చింది. ఇందులో భాగంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వ్యవసాయేతర భూముల నమోదు కోసం ముందస్తుగా స్లాట్లను బుక్ చేసుకున్న పలువురు గురువారం కార్యాలయాలకు చేరుకోగా సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఒక్కో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సాధారణంగా 20 నుంచి 30వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. అయితే ఈ కేవైసీ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోగా కార్యాలయాలకు వచ్చిన పలువురు సాయంత్రం వరకు అక్కడే పడిగాపులు కాస్తూ కనిపించారు. ప్లాట్లు, ఇండ్ల అమ్మకాలు, కొనుగోలుదారులతోపాటు సాక్షులు కూడా కార్యాలయాలకు రావాల్సి ఉంటుంది. దీనివల్ల చాలా మంది కార్యాలయాలకు వచ్చి మధ్యాహ్నం వరకు చూసి వెనుదిరిగారు. మరికొంత మంది సాయంత్రం వరకు అక్కడే వేచి ఉండడం కనిపించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వానికి ఉమ్మడి జిల్లా నుంచి సంవత్సరానికి రూ.వందల కోట్ల ఆదాయం వస్తోంది. త్వరలో ప్రభుత్వం భూముల విలువ పెంచేందుకు సిద్ధమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి డిసెంబర్ వరకు, ఆ తర్వాత పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు రావడంతో మరో మూడు, నాలుగు నెలల వరకు రిజిస్ట్రేషన్లపై ప్రభావం పడింది. ఎల్‌ఆర్‌ఎస్‌పై కూడా స్పష్టత కరువైంది. 2021నుంచి లే అవుట్లపై నిబంధనలు అధికం కావడం జరిగింది. 2019-20 సంవత్సరంలో డీటీసీపీ అనుమతి లేని వెంచర్లలో ప్లాట్లను రిజిస్ట్రేషన్లను చేసి తర్వాత నిలిపివేశారు. 2022-23లో రిజిస్ట్రేషన్లు తగ్గినా భూముల మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు పన్ను, సేవల రుసుము, బదిలీల సుంకం పెరిగి ఆదాయం వచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం పాలమూరులోని ఐదు జిల్లాల్లో 64వేల మంది దరఖాస్తు చేసుకొన్నారు. దీనిపై ఇప్పటికీ స్పష్టత రాలేదు. ఇలా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకూ, వెనకకూ అన్నట్లు సాగుతుండగా సాంకేతిక సమస్య ఆ శాఖకు మరింత నష్టం కలిగించనుంది. ఇదిలా ఉంటే సాంకేతిక సమస్యతో తిరిగి వెళ్లిన వారికి కచ్చితంగా శుక్రవారం సేవలు అందుతాయనే సమాచారం మాత్రం ఇవ్వలేదు. ఫోన్లు చేసి కనుక్కొని రావాలనే అనధికారిక సమాచారం మాత్రం లభించడంతో నిట్టూర్చుకుంటూ తిరిగి వెళ్లారు.



నాగర్‌కర్నూల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు



వనపర్తిలో రిజిస్ట్రేషన్ల కోసం ఎదురుచూస్తున్న జనం

## వెనుదిరిగిన జనం

వనపర్తి, జూలై 11 (నమస్తే తెలంగాణ) : ఒక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే కష్టాలనేకం ఉంటాయి. భూములు, ఇండ్లు, ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతాయి. వీటికి తోడు రుణాలిచ్చే క్రమంలో మార్టిగేజ్‌లు సైతం అధికంగానే ఉంటాయి. ఇలా ఒక్క వ్యవహారం రిజిస్ట్రేషన్ వరకు రావాలంటే.. దానికి ముందు నెలల తరబడి కసరత్తు జరిగితేనే రెడీ అవుతుంది. డబ్బుల లావాదేవీలు.. ఇతర సమస్యలు అన్ని కొలిక్కి వచ్చేలా చేసుకొని చివరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు పూనుకుంటారు. తీరా కార్యాలయానికి వచ్చే సరికి సర్వర్ డౌన్ అంటూ అధికారులు చెబుతుండడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు. వనపర్తి రిజిస్ట్రేషన్ల కార్యాలయానికి గురువారం దాదాపు 50మంది డాక్యుమెంట్లతో వచ్చారు. వీరిలో ఎక్కువ మంది ఇండ్లు, ప్లాట్లు, కొన్ని మార్టిగేజ్‌లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల కోసం వచ్చారు. అయితే ఉదయం కొంత సమయం మాత్రమే సర్వర్ పనిచేసినట్లు కనిపించింది. వచ్చిన వారందరికీ సర్వర్ ప్రాబ్లం ఉందని, మంచిగా అవుతుందని చెబుతూ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయం చుట్టూ తిప్పుకొన్నారు. తీరా ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. చివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య తలెత్తిందంటూ అధికారులు సమర్థించుకుంటూ లబ్ధిదారులకు సెలవిచ్చారు. మధ్యలో వస్తుందేమో అనుకొని ఆశతో చివరి నిమిషం వరకు జనం కార్యాలయం వద్దే వేచి ఉన్నారు. ఒక్క రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు రెండు వైపులా కలిసి ఐదు నుంచి పదిమంది వరకు కార్యాలయానికి రా వాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారితోపాటు సాక్షులు తదితర పెద్దమనుషుల సమక్షంలో ఈ తతంగం పెద్ద ఖర్చుతో కూడుకున్నది. వీటికి అదనంగా ఇక రిజిస్ట్రేషన్ల కార్యాలయంలో ఉండే దోపిడీ ఉండనే ఉంటుంది. ఇలా అన్ని వ్యయ ప్రయాసాలకోర్చి రిజిస్ట్రేషన్ చేయించుకుందామనుకొని వచ్చిన వారికంతా అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరాశే ఎదురైంది.

### సర్వర్ వస్తుందనుకున్నాం..

రిజిస్ట్రేషన్లకు అప్పుడప్పుడు సర్వర్ సమస్య వస్తుంది. అయితే త్వరగానే సమస్య తీరిపోయేది. ఇంతలా సమస్య ఎప్పుడూ రాలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్ల పనే జరగలేదు. అయితే వచ్చిన డాక్యుమెంట్లను కంప్యూటర్లలో నమోదు చేశాం. కానీ మళ్లీ రేపు వస్తేనే రిజిస్ట్రేషన్ పని పూర్తవుతుంది. ఈ-కేవైసీ సమస్య ద్వారా గురువారం కార్యాలయంలో పని జరగలేదు. 40కి పైగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ల కోసం వచ్చాయి.

- మహ్మద్ జమీర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, వనపర్తి జిల్లా

## ప్రజల ఇక్కట్లు

నారాయణపేట, జూలై 11 : నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో జనం ఇక్కట్ల పాలయ్యారు. సర్వర్ డౌన్ కావడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల వద్ద రిజిస్ట్రేషన్లు జరుగకపోవడంతో రిజిస్ట్రేషన్, ఈసీ, సీసీ ప్రతుల కోసం వచ్చిన వినియోగదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. రోజు వారి మాదిరిగానే కార్యాలయంలో సేవలు అందుతాయని రిజిస్ట్రేషన్ కోసం గురువారం సైతం కార్యాలయానికి వచ్చిన జనం గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి చూశారు. ఈకేవైసీ, సర్వర్ వంటి సమస్యల వల్లనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయిందని కార్యాలయ సిబ్బంది అభిప్రాయపడ్డారు. చేసేది ఏమిలేక సిబ్బంది పెండింగ్ ఆఫ్‌లైన్ పనులను చేసుకుంటూ దర్శనమిచ్చారు.




నారాయణపేటలో ఖాళీగా కూర్చున్న కార్యాలయ సిబ్బంది

### నాగర్‌కర్నూల్‌లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం

| సంవత్సరం | రిజిస్ట్రేషన్లు | ఆదాయం (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2019-20 | 1,83,425 | 175 |
| 2020-21 | 1,05,629 | 104 |
| 2021-22 | 1,04,789 | 210 |
| 2022-23 | 1,02,688 | 244 |
| 2023 ఏప్రిల్ నాటికి | 98,900 | 250 |

### ఈకేవైసీ పని చేస్తలేదంటూ..



మాది తాడూరు. మా ఇల్లు రిజిస్ట్రేషన్ కోసం నాగర్‌కర్నూల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చాం. ఇంతకు ముందే ఆన్‌లైలో స్లాట్ బుక్ చేసుకున్నాం. గురువారం రిజిస్ట్రేషన్ కోసం వస్తే ఈకేవైసీ పనిచేయడం లేదంటున్నారు. రేపు రావాలని చెప్పారు. రేపు కచ్చితంగా రిజిస్ట్రేషన్ తిరిగి ప్రారంభమవుతుందని మాత్రం చెప్పలేదు. సాయంత్రం వరకు కార్యాలయం వద్దే ఉన్నాం. త్వరగా సమస్యను పరిష్కరించాలి.

- వీరాచారి, నాగర్‌కర్నూల్

### ముందే సమాచారం ఇవ్వాలి



అచ్చంపేటలో ఉదయం 10గంటల నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. హైదరాబాద్‌లోని స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీకి ఫోన్ చేసి అడిగినా పీఏ సరిగ్గా స్పందించలేదు. సర్వర్ పని చేయనప్పుడు ముందుగానే సమాచారం ఇస్తే బాగుంటుంది. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తున్న అధికారులు సమాచారాన్ని కూడా ముందుగా ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలి.

- గుండోజు గంగాధర్, అచ్చంపేట

### రాష్ట్రమంతా ఇదే సమస్య..



రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ సమస్య రాలేదు. ఈకేవైసీ రాష్ట్రమంతా నిలిచిపోయింది. నాగర్‌కర్నూల్‌లో రోజూ 20 నుంచి 30 రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. హైదరాబాద్‌లోనే సమస్య ఉంది. శుక్రవారం నాటికి సరిచేస్తామన్నారు. ఈ రోజు నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు రెండు రోజుల్లో చేసేలా చర్యలు తీసుకుంటాం.

- కృష్ణంరాజు, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, నాగర్‌కర్నూల్

## గంటల తరబడి ఎదురుచూపులు

జడ్చర్లటౌన్, జూలై 11 : జడ్చర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆన్‌లైన్ సాంకేతిక సమస్యతో ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన కార్యాలయంలో ఐదు గంటల వరకు సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సర్వర్ పనిచేయక కార్యాలయ సిబ్బంది ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. అదేవిధంగా సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారందరూ వెనుదిరిగాల్సి వచ్చింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు సర్వర్ ఎప్పుడూ పనిచేస్తోందో, ఎప్పుడో పనిచేయదో తెలియని పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఈ సమస్య ఎదురవుతుండటంతో రిజిస్ట్రేషన్లకు ఇబ్బందిగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కార్యాలయ సిబ్బంది వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లు జరగలేదని చెప్పుకొచ్చారు.



మహబూబ్‌నగర్ కార్యాలయం వద్ద క్రయవిక్రయదారుల ఎదురుచూపులు



నాగర్‌కర్నూల్‌లో సర్వర్ పనిచేయకపోవడంతో ఖాళీగా కూర్చున్న సిబ్బంది

## మహబూబ్‌నగర్‌లో రూ.3 కోట్ల నష్టం

మహబూబ్‌నగర్, జూలై 11 : ఉమ్మడి జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లు ఒక్కసారిగా నిలిపోయాయి. ఎన్నికల అయినప్పటినుంచి ఇప్పటి వరకు భూముల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్లు మందకొడిగా కావడంతో ఆదాయం పూర్తిగా కొరవడింది. ఈ క్రమంలో గురువారం మహబూబ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాశారు. సర్వర్ డౌన్‌పై ఇంకా స్పష్టత రాలేదని అధికారులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్లు శాఖ కార్యాలయాల నుంచి ప్రతి రోజు 200నుంచి 250 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవి. అయితే సర్వర్ ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయక పోవడంతో ప్రజలు పడిగాపులు కాశారు. కాగా, గురువారం మహబూబ్‌నగర్ జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖకు దాదాపు రూ.3కోట్ల ఆదాయం వచ్చేది. సర్వర్ డౌన్ కావడంతో ప్రభుత్వానికి రూ.3 కోట్ల నష్టం వచ్చిందని అధికారులు తెలిపారు.

## సాంకేతిక లోపంతో సమస్యలు

గద్వాల అర్బన్, జూలై 11 : జిల్లా వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు తాసీల్దార్ కార్యాలయాల్లో సాంకేతిక లోపంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంకేతిక సమస్య ఏర్పడడంతో వివిధ గ్రామాల నుంచి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ అధికారి చంద్రశేఖర్ రెడ్డిని వివరణ కొరగా రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక సేవలు నిలిచిపోయాయని అందుకే రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని చెప్పారు.



ఖాళీగా ఉన్న గద్వాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

## బాధితులకు అండగా ఉంటా..

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల/ఎర్రవల్లి చౌరస్తా, జూలై 11 : బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు తెలిపారు. ఇటిక్యాల మండలం పెద్దదిన్నెలో కుర్వతిమ్మన్న, ఎర్రవల్లి మండలం ధర్మవరం, కోదండాపూర్, గార్లపాడు, తిమ్మాపూర్, వల్లూరు గ్రామాల్లో లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అలంపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాందేవ్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవిప్రకాశ్, యుగంధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుందర్‌రాజు, సుధాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లోకారెడ్డి, తిమ్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పెద్దదిన్నెలో బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



వనపర్తి కలెక్టరేట్‌లో సమావేశ నిర్వహణకు చేసిన ఏర్పాట్లు

## అభిప్రాయ సేకరణకు వేళాయే


- నేడు వనపర్తి కలెక్టరేట్‌లో సమావేశం
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

వనపర్తి, జూలై 11 (నమస్తే తెలంగాణ) : రైతుభరోసా అమలు కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగా శుక్రవారం వనపర్తి కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగనున్నది. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, రాజనర్సింహ, కృష్ణారావు, నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉదయం 9:30 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో మంత్రుల బృందం ఇక్కడికి చేరుకోనున్నది. ఉమ్మడి జిల్లా నుంచి 250 మంది రైతులు ఈ సమావేశంలో పాల్గొననుండగా.. గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఎమ్మెల్యే మేఘారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు.

## కాంగ్రెస్ హామీలపై ప్రశ్నిద్దాం

- అందరం కలిసికట్టుగా పోరాడుదాం
- ఒకరు పోయినంత మాత్రాన నష్టం లేదు
- శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

ధరూరు/కేటీదొడ్డి, జూలై 11 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలపై ప్రశ్నిద్దామని శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ పిలుపునిచ్చారు. కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురువారం గట్టు మండలకేంద్రంలో పార్టీ సీనియర్ నాయకులతో కలిసి వెంకటేశ్‌నాయుడు నివాసంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అలాగే కేటీదొడ్డి మండలకేంద్రంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ పార్టీ పెద్ద వ్యవస్థగా పనిచేస్తున్నదన్నారు. ఒక వ్యక్తి పోయినంత మాత్రాన పార్టీకి ఎలాంటి ఢోకా లేదన్నారు. అందరం కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. ప్రభుత్వ హామీలు అమలయ్యేలా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడదామన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కథలు చెప్పిన కాంగ్రెస్ కేసీఆర్ హయాంలో జరిగిన రిక్రూట్‌మెంట్‌కే ప్లేస్‌మెంట్ ఇవ్వలేకపోతున్నదని, ఇక కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులపై లాఠీచార్జి చేసిందని, ఓయూలో ఉద్రిక్తత నెలకొన్నదని గుర్తు చేశారు. విద్యావ్యవస్థను ఆగం చేసిందని ఆరోపించారు. రైతులకు రైతు భరోసా ఏదీ.. రైతు బీమా ఏదీ.. రెండు పంటలకు నీరేదీ.. ఇలా ప్రశ్నిస్తే అంతా శూన్యమే కాబట్టి కార్యకర్తలుగా మనం గట్టిగా నిలబడదాం, ప్రజల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిద్దామన్నారు. మేమూ ఇక్కడే ఉంటాం.. కేటీఆర్ అండగా ఉంటాడు. గద్వాలలో మళ్లీ బీఆర్‌ఎస్ జెండాను రెపరెపలాడిద్దామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే బండ్ల కాంగ్రెస్‌లోకి వెళ్లినంత మాత్రాన పార్టీ కార్యకర్తలు, ప్రజలు అధైర్యపడొద్దని, మీకు మేమంతా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలల్లోనే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మండిపడ్డారు. ప్రజలందరూ ఒక్కతాటిపైకి రావాలన్నారు. కేసీఆర్ పథకాలన్నీ బంద్ అయ్యాయని.., ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి ఢిల్లీకి తిరగడంతోనే సరిపెడుతున్నాడని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత బాసు హనుమంతునాయుడు మాట్లాడుతూ కాంగ్రెస్ అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇది ఎమ్మెల్యే బండ్లకు కూడా తెలుసని, అయితే ఆయన స్వప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరారన్నారు. అభివృద్ధి కోసం కాదనేది కార్యకర్తలు గుర్తించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కోసం పని చేసిన వారందరినీ మోసం చేసి ఎమ్మెల్యే తన సొంత పనుల కోసం అధికార పార్టీలోకి పోయాడన్నారు. కార్యకర్తల కోసం వెళ్లానని చెబుతున్న ఎమ్మెల్యే మాటల్లో నిజం లేదన్నారు. కేవలం కమీషన్ల కోసమే పార్టీ మారాడన్నారు. ఆయా సమావేశాల్లో నాయకులు అంగడి బస్వరాజ్, వెంకటేశ్‌నాయుడు, శ్రీనివాసులు, కృష్ణ, తిమ్మన్న, టవర్ మక్బూల్, మోనేశ్, కుర్వ పల్లయ్య, మంద మల్లికార్జున్, కొండయ్య, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.



ధరూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయగౌడ్